ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024



ఆగని ఇసుక అక్రమాలు

వైసీపీ ప్రభుత్వం మారినా ఇసుక అక్రమాలు ఆగడం లేదు. తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలను లద్దిగం గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో అతిపెద్ద చెరువుల్లో లద్దిగం చెరువు కూడా ఒకటి. మొత్తం 750 ఎకరా (చౌడేపల్లె మండలంలో 500, పుంగనూరు మండలంలో 250 ఎకరా)ల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు ఆయకట్టు కింద లద్దిగం, బండ్లపల్లె, కొత్తపల్లె, తిర్ణింపల్లె, మలసముద్రం, అంకుతోటపల్లె, పుదిపట్ల గ్రామాలకుచెందిన సుమారు వెయ్యి ఎకరాలపైనే ఆయకట్టు భూములను రైతులు సాగు చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

- చౌడేపల్లె, ఆంధ్రజ్యోతి



తవ్వకాలకు వాడుతున్న యంత్రాలు

40 అడుగులకుపైగా తవ్వేయడంతో నదిని తలపిస్తున్న లద్దిగం చెరువు



వివరాలు తెలియజేస్తున్న గ్రామస్తులు

అడ్డుకున్న గ్రామస్తులు

చేస్తోంది వైసీపీ వారే..

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను కొన్నేళ్లుగా ఈ చెరువులో తవ్వేసి.. తరలించి.. కోట్లు గడించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా టీడీపీ నాయకుల అండతో నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలు ఆపలేదు. గత ప్రభుత్వంలో నోరు తెరవడానికి కూడా భయపడిన మేము.. ప్రస్తుతం ధైర్యం చేసి, తవ్వకాలను అడ్డుకున్నాం. మమ్మల్ని చూసి అక్కడ పనిచేస్తున్న వారు యంత్రాలను వదిలి వెళ్లిపోయారు.



నదిని తలపిస్తున్న లద్దిగం చెరువు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

చెరువులో సుమారు 40 నుంచి 50 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వేసి.. ఇసుక తీసేస్తున్నారు. నదిని తలపించేలా తవ్వేయడం వల్ల చెరువు రూపు కోల్పోవటంతోపాటు, భూగర్భ జలాలూ అడుగంటిపోతున్నాయి. దీనిపై గతంలో, ప్రస్తుతం ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మా చెరువును రక్షించుకోవాలన్న ఉద్దేశంతో తవ్వకాలను అడ్డుకున్నాం. కలెక్టర్ స్పందించి తవ్వకాలు జరగకుండా చేసి, చెరువును బాగు చేయించాలి.

ఐదు ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ సీజ్

తహసీల్దార్ హనుమంతును వివరణ కోరగా.. చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలియగానే తమ సిబ్బందితో వెళ్లి అక్కడున్న ఐదు ఎక్స్‌కవేటర్లు, ఓ టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పనులను ఆపించామన్నారు. అలాగే తహసీల్దార్ ఆదేశాలతో పనులు జరగకుండా తమ సిబ్బందిని అక్కడే బందోబస్తు పెట్టినట్లు వివరించారు.

ఇసుకాసురులపై కన్నెర్ర

● యంత్రాలతో తవ్వినా, అక్రమంగా తరలించినా కేసుల నమోదు

చిత్తూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుకాసురులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ కన్నెర్ర చేశారు. ఇసుకను స్మగ్లింగ్ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో గుర్తించిన ఇసుక పాయింట్లలో యంత్రాలతో తవ్వుతున్నట్లు తెలిసినా, అక్రమంగా తరలిస్తున్నా.. పార్టీలకు అతీతంగా కేసులు నమోదు చేస్తున్నారు. జీడీనెల్లూరు మండలంలో ఇటీవల యంత్రాలతో ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారని తెలుసుకున్న అధికారులు దాడులు చేసి.. మిషనరీని సీజ్ చేశారు. శుక్రవారం గుడిపాల మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో 22 ట్రాక్టర్ల మేర ఇసుకను డంప్ చేసి ఉండగా.. మైన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

ఎందుకంటే.. : రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఒక్క ఇసుక రీచ్ కూడా లేనివి ఏడు జిల్లాలుండగా.. అందులో చిత్తూరు కూడా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. అప్పటికే స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్న ఇసుకను రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేసి సామాన్యులకు అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసపల్లె, పాలూరు, గంగవరం మండలంలోని బైరెడ్డిపల్లె క్రాస్ ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు ఉండగా.. కొత్త ఇసుక పాలసీ పేరుతో పంపిణీ ప్రారంభించారు. ఈ స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోయాక.. అధికారులు మిన్నకుండిపోయారు. తర్వాత 20 మండలాల్లోని 45 ప్రాంతాల్లో ఇసుక పాయింట్లను గుర్తించారు. ఈ ప్రాంతాల నుంచి అవసరాలున్న ప్రజలు యంత్రాలు వాడకుండా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రకటించారు. ఈ పాయింట్లలోనే కాకుండా మరే ఇతర వాగులు, వంకల్లో ఇసుక లభించినా మనుషుల సాయంతో ఇసుకను తీసుకుని వెళ్లవచ్చు. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రజల్ని ఆపి ఇబ్బంది పెట్టకూడదని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు.

కఠినంగా ఉంటాం



ఇసుకను తవ్వుకునేందుకు యంత్రాలను వాడకూడదు.. నిల్వ ఉంచకూడదు.. అనేది ఉచిత ఇసుక పాలసీలో ప్రధానాంశం. దాన్ని అమలు చేయడంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. యంత్రాలు వాడుతున్నా, నిల్వ ఉంచినా వెంటనే దాడులు చేసి కేసులు పెట్టేస్తాం. ఇసుక నిజంగా అవసరమైనవారు ఆయా ప్రాంతాల నుంచి ఉచితంగా తీసుకెళ్లండి. ఎవ్వరూ అడ్డుకోరు.

- సుమిత్‌కుమార్, కలెక్టర్



కొండను తలపిస్తున్న ఇసుక కోసం చెరువులో తీసిన మట్టి

ఎమ్మెల్సీ భరత్ కనబడుటలేదు

● సోషల్ మీడియాలో వైసీపీ కార్యకర్తల పోస్టులు



కుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన చిత్తూరు ఎమ్మెల్సీ కేజేఆర్ భరత్ ఎన్నికల తర్వాత కుప్పంలో కనిపించకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మీద కుప్పం నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కొద్దిరోజులు తప్ప కుప్పంలో లేరు. సొంతూరు హైదరాబాదుకు వెళ్లిపోయారు. స్థానికంగా పార్టీకి నాయకత్వం వహించేవారు లేకపోవడంతో అసహనానికి గురైన వైసీపీ కార్యకర్తలు.. 'ఎమ్మెల్సీ భరత్ మాకు కనిపించడంలేదు. ఆచూకీ తెలిసినవారు మాకు తెలియజేయగలరు- కుప్పం నియోజకవర్గ కార్యకర్తలు' అని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'కనబడుటలేదు' అన్న శీర్షికతో ఉన్న ఈ పోస్టుల్లో, 'పేరు: భరత్ ఎమ్మెల్సీ, వయసు: 35' అని కూడా స్పష్టంగా రాశారు. నిన్న మొన్నటిదాకా వైసీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కూడా అయిన భరత్ ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అపరిమిత అధికారం అనుభవించారు. తన సామాజిక వర్గంలోనే కొందరిలో ఆయనపట్ల అప్పట్లో తీవ్ర వ్యతిరేకత ఉండేది. ఇపుడు ప్రతిపక్షంలో వచ్చిన సమయంలో తమకు అండగా ఉండకుండా సొంత ప్రాంతానికి వెళ్లిపోవడంపై వైసీపీ కార్యకర్తలు ఆగ్రహావేశాలు వ్యక్తపరిచారు.

రాజకీయాలకతీతంగా ఉన్నత విద్య

● ద్రావిడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో ఎమ్మెల్సీ కంచర్ల



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, అధ్యాపకులు

గుడుపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఉన్నత విద్యను కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ద్రావిడ విశ్వవిద్యాలయం 27వ వ్యవస్థాపక దినోత్సవం అక్కడి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. తొలుత వర్సిటీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. వర్సిటీలో సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం ముందుందన్నారు. కొత్తగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులు పెట్టడానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ సీఎస్ మునిరత్నం మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వీసీ ఆచార్య దొరస్వామి మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల సహకారంతో ద్రావిడ భాషల పరిరక్షణకు విశ్వవిద్యాలయ కృషి చేయడం గొప్ప విషయమన్నారు. తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తులనాత్మక అధ్యయనాల ద్వారా సాంస్కృతిక అనుసంధానం సాధ్యమౌతుందని తెలిపారు. డీన్ ఆచార్య శ్యామల విశ్వవిద్యాలయం 27 సంవత్సరాల్లో జరిగిన ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలన్నారు. అనంతరం డాక్టర్ దేవకి రచించిన గృహ వైద్యం, డాక్టర్ గణేష్ మూర్తి రచించిన తమిళ సాహిత్యం పుస్తకాలను ఆవిష్కరించారు. అంతకుముందు హరప్ప భవనంలో నూతన తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ బీఆర్ సురేష్ బాబు, పాలకమండలి సభ్యులు డాక్టర్ నిర్మల, కూటమి నాయకులు, అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు వైసీపీ కార్యకర్తల అరెస్ట్

● రైతులు, కూటమి శ్రేణులపై దాడి చేయడమే కారణం: సీఐ

పుంగనూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం ఇప్పించాలని పుంగనూరులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బాధిత రైతులు, ఎన్డీఏ కూటమి నేతలు విన్నవించాలని వెళ్లినపుడు జరిగిన దాడి కేసులో నలుగురు వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు గతంలో పరిహారం ఇస్తామని ఎంపీ హామీ ఇవ్వడంతో ఈ ఏడాది జూలై 17న విన్నవించడానికి కూటమి శ్రేణులతో కలిసి ఆయనవద్దకు వెళ్లారు. స్థానిక కొత్తఇండ్లులోని మాజీ ఎంపీ ఎస్.రెడ్డెప్ప ఇంటి వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో రైతులు, కూటమి శ్రేణులపై దాడులకు పాల్పడ్డారు. పలువురు గాయపడ్డారని అప్పట్లో టీడీపీ మైనార్టీ నాయకుడు సయ్యద్ సుహేల్ బాషా, ప్రసాద్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లోని నిందితులైన నలుగురు వైసీపీ కార్యకర్తలను శనివారం అరెస్టు చేశారు. వీరిలో.. పుంగనూరు ఎన్ఎస్‌పేటకు చెందిన షంషీర్ బాషా కుమారుడు మహబూబ్‌బాషా(అమ్ముకుట్టి), రాతి మసీదువీధికి చెందిన నజీర్‌బాషా కుమారుడు ఇర్ఫాన్‌బాషా, ఎంబీటీ రోడ్డు సమీపంలో కాపురం ఉన్న ఫజులుద్దీన్ కుమారుడు ఎం.నిజాముద్దీన్, సుబేదార్ వీధికి చెందిన అన్వర్‌బాషా కుమారుడు సయ్యద్‌అయూబ్ ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ వివరించారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

రేపు పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

పోలీసుశాఖ ఆధ్వర్యంలోనూ సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసి ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. అనివార్య కారణాలతో మంగళవారానికి మార్పు చేశామని ఒక ప్రకటనలో తెలిపారు.

టెట్‌కు 414 మంది హాజరు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు ఆదివారం 414 మంది హాజరయ్యారు. జిల్లాలోని రెండు సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరిగిన పరీక్షలకు 467 మంది అభ్యర్థులకుగాను 53 మంది గైర్హాజయ్యారు. ఉదయం సెషన్‌లో 237 మందికిగాను 203 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 230 మంది అభ్యర్థులకుగాను 211 మంది హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ఆధార్ అప్‌డేట్‌కు మరో అవకాశం

● రేపటినుంచి ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్‌కు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆధార్ పొంది పదేళ్లు పూర్తయినవారు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు అవసరమైనవారు, ఐదేళ్లు, 15 ఏళ్లు దాటిన పిల్లలు వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. నాలుగురోజులపాటు శిబిరాల నిర్వహణకు 123 కిట్లు జిల్లాకు చేరాయి. అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసే శిబిరాలను ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పాతపేట పంచాయతీ పూరేడువాండ్లపల్లె, బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె వద్ద ఆదివారం వేకువజామున ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. ఉదయం కల్లూరు మీదుగా చిత్తూరు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో తూర్పు అటవీ విభాగంలోకి ఏనుగుల గుంపు చేరుకుంది. దీంతో కోటపల్లె, జూపల్లె, పాళెం ప్రజలు తమ పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తాయని భయాందోళన చెందుతున్నారు. ఆవులపెద్దిరెడ్డిగారిపల్లెలోని రమణయ్యకు చెందిన అర ఎకరా వరి, తిరుమలయ్యకు చెందిన అర ఎకరా వరి, కౌలురైతు రామయ్యకు చెందిన అర ఎకరా వరిపంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. పూరేడువాండ్లపల్లెలోని శిద్దయ్యకు చెందిన ఎకరా వరి, వాసుకు చెందిన ఎకరా వరి, శేఖర్‌కు చెందిన అర ఎకరా వరి, పశుగ్రాసం, పూలతోటను నాశనం చేశాయి. కల్లూరులోని శ్రీనివాసులు మామిడితోటకు అమర్చిన రాతికూసాలను విరిచేశాయి. ధ్వంసమైన పంటలను పశ్చిమ అటవీ విభాగం డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు. బాధిత రైతుల వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.



అమ్మో.. కొండచిలువ

గుడిపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 190 రామాపురం దళితవాడలో ఆదివారం రాత్రి కొండచిలువ ప్రవేశించింది. దీనిని గమనించిన గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే దానిని చాకచక్యంగా హతమార్చడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

98 మద్యం దుకాణాల ప్రారంభం

చిత్తూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 104 ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఆదివారంనాటికి 98 ప్రారంభమయ్యాయి. రాజకీయ నేతలు, స్థానిక నేతల ఒత్తిళ్లు, మహిళా సంఘాల అడ్డంకులు దాటుకుని దుకాణాలను ప్రారంభించారు. మిగిలినచోట్ల కొంతమందికి అనువైన దుకాణాలు, మంచి ముహూర్తాలు, ఒప్పందాలు కుదరక పోవడంతో ప్రారంభం కాలేదు. కొందరు మద్యం దుకాణాలు ప్రాంభించిన రోజునుంచి స్టాక్ మొత్తం అమ్ముకుని కొత్త స్టాకు కోసం మద్యం డిపోలకు చేరుకుంటున్నారు.



పచ్చగా.. కనువిందుగా..

ఇలా పచ్చని మొక్కలతో.. కనువిందుగా ఉన్న ఈ డివైడరు ఉండేది తిరుపతి నగరం చింతలచేనుకు తూర్పుగా ఏర్పాటుచేసిన కులశేఖర్ అళ్వార్‌రోడ్డులో. రోడ్డు మధ్యలో దాదాపు 10అడుగుల వెడల్పుతో సువాసన ఇచ్చే పలు రకాల పుష్పాలు, పత్రాల మొక్కలను నాటారు. ఈ దారిలో రాకపోకలు సాగించే వారితో పాటు.. అటు పక్కన వెళ్లే రైలులోని ప్రయాణికులనూ ఆకట్టుకుంటున్నాయి. ఇటుగా వెళ్లే వారు డివైడరు వద్ద ఫొటోలు దిగుతున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఇలా నెట్టుకొచ్చారు

కదిలితేనే బండి. లేదంటే మొండి. ఇలా మొరాయించిన ట్రాక్టరును ఆదివారం ఉదయం తిరుపతిలో తాపీ కూలీలు తోసుకుంటూ వెళ్లారు. భవనస్లాబ్ కోసం మిక్సర్, ఇతర పరికాలతో పాటు కూలీలు కరకంబాడి రోడ్డు సమీపం నుంచి ట్రాక్టర్, ట్రాలీతో బయలుదేరారు. లీలామహల్ సమీపానికి చేరుకోగా ట్రాక్టర్ ఆగిపోయింది. ఎంతకీ స్టార్టు కాకపోవడంతో మెకానిక్ షెడ్డు వరకు ఇలా తోసుకుంటూ వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి




సోది చెబుతామమ్మా..



బుర్రలు చేతపట్టి 'సోదమ్మో సోది' అంటూ తీర ప్రాంత పల్లెల్లో తిరిగేవారు ఇటీవల పెరిగారు. వీరిపై నమ్మకంతో కొందరు మహిళలు సోది చెప్పించుకుంటున్నారు. గతంలో 'సోది' చెప్పే బుర్రక్కలకు ఆదరణ ఉండేది. ఇదే జీవనాధారంగా ఎన్నో కుటుంబాలు బతికాయి. మారుతున్న కాలాన్ని బట్టి సోది మాటే లేకుండా పోయింది. అయితే, దసరా నుంచి కోట, వాకాడు, చిట్టమూరు తదితర సముద్రతీర మండలాల్లో సోది బుర్రక్కల సందడి ఉంటోంది.

- కోట, ఆంధ్రజ్యోతి



సందర్శకులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన కాటేజీ



గెస్ట్ హౌస్‌ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్‌లు



డార్మెటరీలో ఏర్పాటు చేసిన పడకలు

చుట్టూ ఎత్తయిన చెట్లు. స్వచ్ఛమైన గాలి. పక్షుల కిలకిలరావాలు. వీటి నడుమ ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకుంటున్నారా? ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాసింత ఆహ్లాదానుభూతులను పొందాలనుకుంటున్నారా? అయితే, మామండూరు వెళ్లాల్సిందే.

- మంగళం, ఆంధ్రజ్యోతి

రారండోయ్.. మామండూరు

● మానసికోల్లాసానికి 'వాటర్ ఫ్లో'

ఎలా వెళ్లాలంటే..

కడప వెళ్లే దారిలో తిరుపతికి 22 కి.మీ. దూరంలో మామండూరు ఉంది. బస్సు లేదా సొంత వాహనాల్లో ఇక్కడకు చేరుకోవచ్చు. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు లోపలకు వెళితే గెస్ట్‌హౌస్ ఉంటుంది. ఇక్కడకు మాత్రం బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో వెళ్లేవారు కార్లు, జీపులకు రూ.20, ఆటోకు రూ.15, ద్విచక్ర వాహనానికి రూ.10 చెల్లించాలి. గెస్ట్‌హౌస్ నుంచి కిలోమీటరు దూరంలో ముచ్చటగొలిపే నీటి ప్రవాహం (వాటర్ ఫ్లో) ఉంది.



గుంట మడుగు వద్ద వాచ్ టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

ఎంచక్కా బస చేయవచ్చు

ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి సాయంత్రం వరకూ ప్రకృతి అందాలను చూడవచ్చు. కటక్, గుంజర, తుంబుర, హరిణి, మయూరి పేర్లతో కాటేజీలున్నాయి. రోజుకు రూ.3వేలు చెల్లించాలి. రెండు బెడ్లు ఉంటాయి. డార్మెటరీకి రూ.6వేలు చెల్లించాలి. ఇందులో 10 బెడ్లు ఉంటాయి. 'వనదర్శిని' వెబ్‌సైట్ ద్వారా గదులు బుక్ చేసుకోవచ్చు. బస చేసేవారు ఆహారాన్ని తీసుకెళ్లవచ్చు. లేదనుకుంటే వండి సరఫరా చేసేందుకు ఓ క్యాంటీన్ ఉంది. ముందుగా ఆర్డర్ ఇస్తే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం తయారు చేస్తారు.

ఎప్పుడు అనుకూలం

తిరుమల కొండల్లోని పాపవినాశనం, గోగర్భం డ్యాం నిండాక నీరు ఇక్కడకు చేరుకుంటుంది. వర్షాల సమయంతో జలపాతాలు కనువిందుచేస్తాయి. నడుము లోతు వరకు వచ్చే ఈ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఈత కొడుతూ మైమరచిపోతారు. ప్రమాదం లేకుండా జలకాలాడటానికి ఇక్కడి వాతావరణం అనుకూలం. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు నీటి ప్రవాహం ఉంటుంది. రోజూ దాదాపు 1,500మంది, అన్‌సీజన్‌లో 400మంది వస్తుంటారు. పిల్లలు ఆడుకోడానికీ కొన్ని సౌకర్యాలున్నాయి.



మామండూరు వద్ద వాటర్ ఫ్లో

త్వరలో జంగిల్ సఫారి



సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచడానికి త్వరలో జంగిల్ సఫారీ ప్రారంభించబోతున్నాం. గెస్ట్ హౌస్ నుంచి అటవీ ప్రాంతంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాల్లో వెళ్లి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రోడ్డు వేశారు. జంగిల్ సఫారీలో అందమైన అటవీప్రాంతాన్ని వీక్షించవచ్చు.

- గౌస్ కరీం, డీఆర్వో

రైతు మోమున లాభాల గుబాళింపు

● పూలసాగుపై పెరుగుతున్న ఆసక్తి

● పండగలొస్తే మరింత లాభసాటి ● వర్షాలకు అడపాదడపా నష్టం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి: ఎర్రావారిపాలెం మండలంలోని రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల దసరా సందర్భంలో మంచి గిట్టు బాటు ధర లభించడంతో వీరిలో ఆనందం వ్యక్తమవుతోంది. సుమారు రెండునెలల్లోనే చేతికందడంతో ఎక్కువమంది బంతి పూలసాగు వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతం కిలో బంతిపూల ధర రూ.40కి తక్కువ లేకుండా పలుకుతోంది. పండుగ సందర్భాల్లో ధర మరింత పెరిగి లాభసాటిగా మారుతోంది. బంతితోపాటు ఇతర పూల పంటలనూ సాగుచేస్తున్నారు. రోజాలు కిలో రూ.160, సెంటు మల్లెలు రూ.200 చొప్పున ధర పలుకుతున్నాయి. మండలంలోని పెద్దనాయనపల్లె, బడగన పల్లె,ఎల్లమంద, ఉస్తికాయల పెంట గ్రామాల్లో రైతులు బంతి సాగు చేస్తున్నారు. భాకరాపేట-తలకోన రోడ్డు పక్కనే పెద్దనాయనిపల్లె వద్ద సాగు చేసిన పూలతోటలకు మంచి డిమాండు ఉంది. రోడ్డు పక్కనే ఉండడంతో తోటలోని పూలు కోసి వెంటనే ఇస్తుండటంతో చాలామంది ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. దీంతో దళారుల బెడద, కమీషన్ లాంటివి లేకుండా వెంటనే చేతికి డబ్బు అందుతోందని చెప్పారు. వ్యాపారులకు పూలను సరఫరా చేస్తే కమీషన్, తోపుడు రిస్కు(అదనంగా పూలు) ఉంటాయంటున్నారు. డబ్బులు సరిగా చెల్లించకపోవడంతో అడపాదడపా నష్టపోతున్నామంటున్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంలోనూ మంచి ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. వర్షాలొస్తే పూల రేకుల్లో నీరు చేరితే కుళ్లిపోయినా, నానినా నాణ్యత తగ్గుతుంది. ఇలాంటప్పుడు తక్కువ ధరకు అమ్మి వీరు నష్టపోతున్నారు. వర్షాకాలంలో చీడ పీడలు, తేమ శాతం ప్రతికూలంగా పరిణమిస్తున్నాయి. ఉద్యాన అధికారులు అధిక దిగుబడినిచ్చే విత్తన మొలకలు సరఫరా చేస్తే నాణ్యమైన పూలతోటలను సాగు చేసి మరిన్ని లాభాలు ఆర్జిస్తామని రైతులు చె బు త ు న్నారు.





అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్యాలయ వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు హర్షదా, అనూష, అక్షర, సహానా, రోషికా, దీప్తి, సంగీత, ధాన్వియ, ప్రగతి, బవదర్శిని తదితరులు శివ శ్లోకం, శ్రీరామచంద్రుడు, స్వాగతం కృష్ణా సుస్వాగతం కృష్ణా, కన్నన్ వరుగింద్ర నీరం, అదిదానో రంగా, తోడై మంగళం, హరే రామ రామ గోవింద హరే వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వారిని ఆదివారం తెలంగాణ, మద్రాసు హైకోర్టుల న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ సుధీర్ కుమార్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ రాజేశ్వరరావు



జస్టిస్ సుధీర్‌కుమార్

శ్రీవారికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చాం

తిరుమల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గోపిచంద్ 'విశ్వం' సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన క్రమంలో వేంకటేశ్వరస్వామిని కృతజ్ఞతలు తెలుపుకునేందుకు వచ్చామని ఆ చిత్ర దర్శకుడు శ్రీను వైట్ల తెలిపారు. నిర్మాత వేణుదోనేపూడి, నటుడు శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీను వైట్ల ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. స్వామికి ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు. విశ్వం చిత్రాన్ని హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలన్నారు. 'దేవర' సినిమాలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని నటుడు శ్రీకాంత్ తెలిపారు. కొన్ని కారణాల వల్ల గోపిచంద్ దర్శనానికి రాలేకపోయారని, ఆయన బదులుగా తాను ఉన్నట్లు అందరు భావించాలన్నారు. తాను నటించిన గేమ్‌ఛేంజర్ సంక్రాంతికి విడుదల కానుందన్నారు. కల్యాణ్‌రామ్, సాయిధరమ్ తేజ్‌తో నటించిన చిత్రాలు కూడా త్వరలో విడుదల కానున్నాయన్నారు. వీటి తర్వాత తాను హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు. తన కుమారుడు రోషన్ 'ఛాంపియన్' అనే సినిమా షూటింగ్‌లో బీజీగా ఉన్నాడని ఓప్రశ్నకు బదులిచ్చారు.



ఆలయం ఎదుట శ్రీను వైట్ల, శ్రీకాంత్, వేణు దోనేపూడి

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు





ప్రమాదానికి గురైన కారు - క్షతగాత్రులు

● ముగ్గురికి గాయాలు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో ఆదివారం కారు అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. తమిళనాడుకు చెందిన భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఆదివారం ఉదయం తిరుమల నుంచి తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 15వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడివైపు నున్న క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ మహిళ గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో తిరుపతికి రుయా ఆస్పత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 80,741 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

మందలించాడని..

● కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేసిన విద్యార్థి

● పోలీసుల అదుపులో బాలుడు.. కేసు నమోదు

తిరుచానూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోజనం చేస్తున్న సమయంలో మందలించారని.. తన ప్రవర్తన తీరుపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని ఆగ్రహించిన విద్యార్థి.. క్షణికావేశంతో కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం అడుసుపల్లికి చెందిన వెంకటరమణ తిరుపతిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఆయన తిరుచానూరులోని బ్రాంచిలో ఉన్నారు. పీలేరుకు చెందిన ఇంటర్ విద్యార్థి.. దసరా సెలవులకు వెళ్లి ఆదివారం రాత్రి క్యాంపస్‌కు వచ్చాడు. రాగానే కళాశాలలో పనిచేసే ఉద్యోగి వెంకటరమణ ఫీజు అడగారు. సమాధానం లేకపోవడంతో అక్కడ కూర్చోబెట్టారు. అదే సమయంలో అతడి తల్లిదండ్రులకు ఫోను చేయగా వారి నుంచి సమాధానం లేదు. అంతకు ముందే ఆ విద్యార్థిపైన కళాశాలలోని వారు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు తీవ్రస్థాయిలో అతడిని మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆ విద్యార్థి.. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆదివారం రాత్రి కళాశాలకు రావడం.. ఫీజు విషయమై ప్రశ్నించారు. అప్పటికే తనపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని, తాను భోజనం చేసే సమయంలో అందరి ముందు అసభ్యంగా మాట్లాడారని ఉద్యోగి రమణపై కోపం పెంచుకున్న విద్యార్థి.. బ్యాగులోని కత్తి తీసి దాడి చేశాడు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తిరుచానూరు పోలీసులకు అప్పగించి, గాయపడిన వెంకటరమణను రుయాకు తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షణికావేశంలో తాను దాడికి పాల్పడినట్లు విద్యార్థి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



గాయపడిన వెంకటరమణ

'సూర్య ఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా



● సోలార్ ప్యానళ్లకు రూ.78వేల వరకు రాయితీ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఇంట్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగిందా..? బిల్లు భారీగా వస్తోందా..? ఈ భారం నుంచి బయటపడాలంటే ఒకటే మార్గం.. అదే సోలార్ విద్యుత్. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన కింద రాయితీతో సోలార్ ప్యానళ్లను అందిస్తోంది.

కిలోవాట్‌కు సగటున 4 యూనిట్లు

ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్ యూనిట్ ఏర్పాటుకు 80 చదరపు అడుగుల స్థలం అవసరం. మూడు కిలోవాట్ల సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేస్తే 240 చదరపు అడుగుల స్థలం అవసరమవుతుంది. ఒక కిలోవాట్ నుంచి రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తవుతుంది. ఒకసారి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు పని చేస్తాయి. నెట్ మీటరింగ్ అమర్చి.. ఉత్పత్తి అయిన సౌర విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వినియోగించుకున్న విద్యుత్తులో ఉత్పత్తి అయిన యూనిట్లను మినహాయించుకుని మిగిలిన యూనిట్లకు సొమ్ము వసూలు చేస్తారు.

కాలుష్యం నివారణకు తోడ్పాటు

విద్యుత్ తయారీకి అధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తారు. ఈ కారణంగా వాతావరణం కాలుష్యమవుతుంది. సోలార్ ప్యానల్ కావడం ద్వారా కాలుష్య నివారణతో పాటుగా లైన్‌లాస్ లేని, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును పొందవచ్చు.

3,229 దరఖాస్తులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎం సూర్యఘర్ యోజన కింద రెండు నెలల వ్యవధిలోనే 3,229వేల మంది దరఖాస్తు చేశారు. అందులో 206 పనులు పూర్తి చేయగా, వీరిలో 76 మంది ఖాతాలకు రాయితీ సొమ్ము కూడా జమైంది. మరో 76 మందికి నెట్ మీటర్ల అమరిక పూర్తయింది. ఇప్పటి వరకు 749.746 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను బిగించడం జరిగింది.

దరఖాస్తు ఇలా..: ఆసక్తి ఉన్నవారు పీఎం సూర్యఘర్ పోర్టల్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసి.. సొమ్ము చెల్లించిన 30 రోజుల్లో యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేల చొప్పున రాయితీ అందుతుంది. రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, మూడు కిలోవాట్‌కు రూ.78వేలను కేంద్రప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. అంతకు మించిన సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్నా.. రాయితీ మాత్రం మూడు కిలోవాట్లకే అందిస్తారు. దరఖాస్తుదారులు తొలుత మొత్తం సొమ్ము చెల్లించాక రాయితీని జమ చేస్తారు. విద్యుత్‌శాఖ క్షేత్రస్థాయిలో సోలార్ ప్యానల్, వైరింగ్, ఎర్తింగ్, నెట్‌మీటరు తనిఖీ చేసి నివేదిక ఇచ్చిన 30 రోజుల్లో వినియెగదారుల ఖాతాకు సొమ్ము జమవుతుంది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి



ఒక్కసారి పెట్టుబడి పెడితే చాలు

విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో చార్జీల భారం మోయక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం సోలార్ విద్యుత్తు. ఒక్కసారి పెట్టుబడి పెడితే 25 ఏళ్లపాటు సోలార్ ప్యానళ్లు పనిచేస్తాయి. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను వాడుకుని.. మిగిలింది విద్యుత్తు శాఖకే విక్రయించవచ్చు. దీనిద్వారా వచ్చే సొమ్ము కూడా లబ్ధిదారుడి అకౌంట్‌కు జమవుతుంది. పూర్తి వివరాలకు విద్యుత్ శాఖ ఈఈ, ఎస్ఈ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ





స్వర్ణ రథంలో వినాయకస్వామి

స్వర్ణరథంపై వరసిద్ధుడి విహారం

కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతి వ్రతం



సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తులతో వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలయ్యాక వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవు చోరీ.. ఆపై చంపి మాంసం రవాణా

ఆటో స్వాధీనం, నలుగురిపై కేసు నమోదు

వెదురుకుప్పం, అక్టోబరు 20: 'ఆవును దొంగిలించి, ఆపై దాన్ని వధించి, మాంసాన్ని రవాణా చేశారు. ఈ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నాం' అని కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిదొన గ్రామానికి చెందిన బి.హరిబాబు కార్వేటినగరం మండలం కార్వేటినగరం రిజర్వు ఫారెస్టులో పశువులను మేతకు వదిలి పెట్టారు. ఈ ఆవును వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం కాలనీకి చెందిన పోతిపోగు సూర్య, పట్లూరి తరుణ్, ఎగువ గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి కలసి అపహరించి, ఆపై వధించి, మాంసాన్ని ఆటోలో తరలిస్తుండగా.. స్థానికులతో కలిసి బాధితుడు అడ్డుకున్నాడు. దీంతో నిందితులు నలుగురూ పరారయ్యారు. దీనిపై హరిబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఆవులను దొంగిలించినా, పశువులను వధించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫోర్జరీ సంతకాల కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న సీఐ హనుమంతప్ప

వెదురుకుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వన్-బీ అండగల్‌ని ఫోర్జరీ సంతకాలతో తయారీ చేసి, పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్న కేసులో ప్రధాన నిందితుడు పుల్లారెడ్డి(67)ని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం గంటావారిపల్లెకు చెందిన ఎస్.పుల్లారెడ్డి, అతడి కుమారుడు జయచంద్రారెడ్డి అదే గ్రామానికి చెందిన సర్వే నెంబరు-513/6లో 0.66 సెంట్ల భూమిని వన్-బీ అండగల్, తహసీల్దార్ ఫోర్జరీ సంతకాలతో రికార్డులు సృష్టించి.. పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నారు. దీనిపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదుతో వెదురుకుప్పం పోలీసుస్టేషన్ కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి పది గంటల సమయంలో వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె దగ్గర వెదురుకుప్పం-చంద్రగిరి రహదారిలో ప్రధాన నిందితుడైన పుల్లారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో ఏ-2 జయచంద్రారెడ్డిని అరెస్టు చేసి.. రిమాండుకు పంపించామని గుర్తు చేశారు. ఇంకా ఈ కేసులో ఎవరైనా ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

14 దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్ఐలు విశ్వనాథ్, లింగాధర్ బృందాలు ఆదివారం భాకరాపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. చిన్నగొట్టిగల్లు రోడ్డులోని కోటబయలు వద్ద కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కొందరు కనిపించారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఇద్దరు పారిపోయారు. ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వారి నుంచి 14 ఎర్రచందనం దుంగలు, కారు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన పల్లెపండుగ

433 గ్రామ పంచాయతీల్లో 722 పనులు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 14వ తేదీన గ్రామ పంచాయతీల్లో ప్రారంభమైన పల్లె పండుగ ఆదివారంతో ముగిసింది. అధికారికంగా ఎమ్మెల్యేలు అందుబాటులో లేని ప్రాంతాల్లో సోమవారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 700 గ్రామ పంచాయతీలకుగాను 433 చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల 722 పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. 646 సీసీ రోడ్లు, నాలుగు బీటీ రోడ్లు, ఐదు పాఠశాల ప్రహరీలు, ఆరు కొత్త ట్యాంకుల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవాలు చేసినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. కాగా పూర్తి అంచనాలు వేయాల్సి ఉంది.

ఒకటే జడివాన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 20 రోజులుగా వాన కురుస్తూనే ఉంది. రెండ్రోజులు తప్పితే 18 రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీగా కురిశాయి. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా చిత్తూరు రూరల్‌లో 60.0 మి.మీ, అత్యల్పంగా నగరిలో 2.2 మి.మీ వర్షం కురిసింది. మండలాలవారీగా.. ఐరాలలో 56.4, చిత్తూరులో 41.0, తవణంపల్లెలో 37.4, గంగాధరనెల్లూరులో 37, పూతలపట్టులో 36.2, బైరెడ్డిపల్లెలో 34.8, సదుంలో 32.6, యాదమరిలో 31.6, పెనుమూరులో 31.4, గుడిపాలలో 23, పెద్దపంజాణిలో 22.6, శ్రీరంగరాజపురంలో 22.4, రొంపిచెర్లలో 21.6, బంగారుపాళ్యంలో 21.4, పులిచెర్లలో 21, చౌడేపల్లెలో 20.6, పుంగనూరులో 18.4, సోమలలో 17.6, శాంతిపురంలో 16.4, గుడుపల్లెలో 14.2, వి.కోటలో 13.2, కుప్పంలో 13, పాలసముద్రంలో 10.6, రామకుప్పంలో 8.2, గంగవరంలో 6, పలమనేరులో 4.2 మి.మీ వర్షం కురిసింది. అక్టోబరు నెల సాధారణ వర్షపాతం 157.1 మి.మీకిగాను ఆదివారంనాటికి అంతకుమించి 176.7 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. సాధారణానికి 20శాతం మించి తొమ్మిది మండలాల్లో, అంతకులోపు 21 మండలాల్లో, 30శాతానికి తక్కువగా గంగవరం, పలమనేరు మండలాల్లో వర్షపాతం నమోదైంది.

చిత్తూరులో మోస్తరు వర్షం



చిత్తూరు గిరింపేటలో కురుస్తున్న వాన

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం సాయంత్రం ఉన్నఫలంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు భారీ వర్షం పడి, పగలంతా ఎండ కాసింది. సాయంత్రమయ్యేసరికి వాన కురిసింది.

గాలివానకు నేలవాలిన వరి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన వర్షం సుమారు గంట సమయం కురవడంతో బలమైన గాలులు వీచి, పిడుగులు పడ్డాయి. మండలంలో సుమారు గంటకుపైగా కరెంటు పోయింది. గాలులకు పలు గ్రామాలలో వరి పంట నేలకు వాలిపోయింది. చేతికి వచ్చిన పంట నోటికి అందకపోవడంతో రైతులు దిగాలు చెందారు. పంట నష్టాన్ని అధికారులు అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.





దెబ్బతిన్న మిరప పంట - నీటిలో మగ్గుతున్న వంగతోట

నీట మునిగిన పంటలు

సదుం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సదుం మండలంలో సుమారు పది రోజులుగా కురుస్తున్న జడివానతో పంటలు నీటిలో మునిగి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోగివారిపల్లె పంచాయతీ మారుతివారిపల్లెలో రైతు అయ్యప్పకు చెందిన మిరప, వంకాయ, చామంతి పంటలు దెబ్బతిన్నాయి. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.



పాతపాళ్యం వద్ద నేల వాలిన వరి



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఏమైంది?: డీసీసీ



ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితంగా టికెట్ కొనిచ్చిన భాస్కర్

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తన సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు గత ఎన్నికలలో ఇచ్చిన ఉచిత ఆర్టీసీ ప్రయాణం హామీ ఏమైందని డీసీసీ అధ్యక్షుడు భాస్కర్ నిలదీశారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు నుంచి కాణిపాకం, తిరుపతి, నెల్లూరు, వెల్లూరు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులకు టికెట్లను కొనుగోలు చేసి.. ఉచితంగా అందజేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ మహిళలతో పోస్ట్ కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రూ.90లకే క్వార్టర్ మద్యం అనే ప్రచారంతో రాష్ట్రంలో మద్యం ఏరులై పారనుందన్నారు. కాంగ్రెస్ మాజీ జిల్లా కార్యదర్శి పరదేశి, మాజీ ఉపాధ్యక్షుడు డి.కన్నన్, పార్టీ అధికార ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి, వెదురుకుప్పం మండల అధ్యక్షుడు ఉమేష్, లీగల్ సెల్ నాయకులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ ఉద్యమాల్లో ఏఐఎస్ఎఫ్‌ది కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటాలు చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.విద్యారంగ సమస్యలపై సంఘం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమ దశలో జరిగిన అరెస్టులు, లాఠీచార్జీలు, జైలు శిక్షలను ప్రస్తావించారు. నాయకులు గతాన్ని మరువకుండా సామాజిక సేవలోనూ పాల్గొనాలని కోరారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జి.ఈశ్వరయ్య, ఎ.రామానాయుడు, బి.లక్ష్మయ్య, ఎస్.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, కోట పురుషోత్తం, మంజునాథ్, విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, డాక్టర్ కాటమరాజు, నాగరాణి, డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై మృతదేహం

వెదురుకుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న దిమ్మెపై 38 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు.కార్వేటినగరం మండలం డీఎంపురం క్రాస్ గోపిశెట్టిపల్లె గ్రామ సమీపంలో మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఎంటీ స్విచ్ఛాఫ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. సంఘటన ఐదారు రోజుల కిందట ఘటన జరగడంతో మృతదేహం కుళ్లిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉందని ఎస్ఐ తెలిపారు. ఎత్తు 5.5 అడుగులు కాగా, బ్లూ రంగు గళ్ల లుంగీ, పాచీ కలర్ కట్ బనియన్, ఎరుపు-తెలుపు గీతలు కలిగిన టవల్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిస్తే కార్వేటినగరం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి నెలాఖరు వరకు గడువు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

కరెంటు చార్జీలు పెంచితే పోరాటం: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ నాగరాజు

గంగవరం, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన అదనపు భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తప్పవని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. ఆదివారం పలమనేరులోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు బీజేపీ, జనసేన, టీడీపీ కరెంటు చార్జీలు పెంచబోమని, పన్నుల పేరుతో ప్రజలపై భారాన్ని మోపమని హామీ ఇచ్చి నేడు ఆ హామీలను విస్మరించడం దారుణమన్నారు. ట్రూ అఫ్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.8114 కోట్ల భారాన్ని మోపడాన్ని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే ట్రూ అఫ్ చార్జీల పేరుతో రూ.1.23 పైసలు వసూలు చేస్తున్నారని, ఇప్పుడు ఇది కాస్త రూ.1.27 పైసలకు పెంచడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఉచిత ఇసుక పాలసీ అని చెప్పి, నేడు ఇసుక ఎక్కడా దొరకకపోవడంతో రెట్టింపు ధరలు వెచ్చించి గృహ నిర్మాణదారులు ఇసుకను కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం పేదలపై భారం మోపకుండా చూడాలని కోరారు. సీపీఐ నాయకులు చెన్నకేశవులు, రామమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): పుంగనూరు బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయుల సర్కిల్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పుంగనూరు పట్టణం భగత్‌సింగ్ కాలనీకి చెందిన రాజ్‌కుమార్ కుమారుడు మహేశ్(17), కుమార్ కుమారుడు ధనూష్(17)లు ఇంటర్ చదువుతున్నారు. అదేప్రాంతానికి చెందిన బాబు కుమారుడు ప్రవీణ్ పెయింట్ పనులు చేస్తున్నారు. ఆదివారం కాలేజీలకు సెలవులు కావడంతో ప్రవీణ్‌తో కలసి ద్విచక్రవాహనంలో భీమగానిపల్లెకు వెళుతుండగా చిత్తూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 సిబ్బంది పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి...

పుంగనూరు రూరల్ : ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం పుంగనూరులో జరిగింది. పట్టణానికి చెందిన స్వాతి (26) ద్విచక్రవాహనంలో వెళుతూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్వాతి తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

తులసీనాథం దంపతులకు కళాపీఠం పురస్కారం



గంగవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : గంగవరంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్ప దంపతులకు జానుమద్ది కళాపీఠం భాషా పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం కడపలోని సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో జాను మద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి ఉత్సవాల సందర్భంగా తులసీనాథం నాయుడు దంపతులను ఆహ్వానించారు. తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి తులసీనాథంనాయుడు దంపతులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, నిర్వాహకులు జానుమద్ది విజయభాస్కర్ చేతుల మీదుగా అందించి సత్కరించి కొనియాడారు. .

రేషన్ బియ్యం స్వాధీనం



బైరెడ్డిపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం రంగంపేట నుంచి అక్రమంగా 2,500 కిలోల రేషన్‌బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుండగా ఆదివారం బైరెడ్డిపల్లె సమీపంలో పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పరశురాముడు తెలిపారు. దీనికి కారకుడైన శివానందన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మాజీ ఎంపీపీ కృష్ణవేణికి సేవా పురస్కారం



బైరెడ్డిపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ కృష్ణవేణి వే ఫౌండేషన్ ద్వారా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన వే ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో కృష్ణవేణికి నిర్వాహ కులు పురస్కారం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కృష్ణవేణికి అభినందనలు తెలిపారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

సదుం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఊటుపల్లె పంచాయతీ మద్దెలవారిపల్లెకు చెందిన పల్లం సురేంద్రపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మాలమహానాడు రాష్ట్ర నాయకులు ఎస్‌ఐ షేక్ షావలికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈనెల 12న సురేంద్రపై స్థానిక అగ్రవర్ణ వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ నిందితుల అరెస్టులో జాప్యం జరుగుతోందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యులు తుమ్మల ధరణీకుమార్, శ్రీకాంత్, అన్నమయ్య, సుభాష్, లోకనాథం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE'S COURT OF PALAMANER
CAMP COURT AT KUPPAM
S.O.P. NO. 03 OF 2024
(IN THE MATTER OF INDIAN HINDU SUCCESSION ACT 1956 UNDER SECTION 372)

Between :
1) Sri M.Mohan 2) Smt. Jayanthi,
3) Sri N.Dakshana Murthy ... Petitioners
And
NILL ... Respondents

PETITIONERS FILED PETITION FOR SUCCESSION CERTIFICATE

That the Petitioners has filed petition for seeking succession certificate through court of law and the same is numbered as S.O.P.No. 03 of 2024 on the file of the Hon'ble Court of Senior Civil Judge's Court of Palamaner, Camp Court at Kuppam and the same matter is posted for paper publication. Any one if you have got any objection in this regard, you may appear before this Hon'ble Court at 10.30 A.M. on 28-10-2024 either in person or through an advocate and file your objections if any in this matter. If you fail to do so, the matter will be declared in favour of the petitioners as per the material available on record.

Smt **G.PUSHPALATHA,** B.A., LL.B.,
Sri **R. SATHYAVELU,** M.Com., LL.B.,
Advocates for the Petitioners, Kuppam.

ఎస్‌ఐని కలిసిన జనసేన నాయకులు



బైరెడ్డిపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ పరశురాముడును ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి దిలీప్, నాయకులు చైతన్య, దినేష్, నగేష్, దేవ, అమర్, రమేష్, మధు, హరి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఐకి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు




ఆలయం ఎదుట గల రాతి స్తంభాలు, కంబాలదేవులపల్లెలోని చౌడేశ్వరమ్మ ఆలయం, చౌడేశ్వరమ్మ వారి ఉత్సవమూర్తి

కరుణామయి సప్తమాతృక చౌడేశ్వరమ్మ


సప్తమాతృకలతో చౌడేశ్వరమ్మ

రామకుప్పం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం పంచాయతీ కంబాలదేవులపల్లెలోని సప్తమాతృక సమేత చౌడేశ్వరమ్మ కరుణామయిగా భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతోంది. గ్రామపొలిమేర్లలో పచ్చని ప్రకృతి అందాల మధ్య గల ఈ ఆలయానికి ప్రతి బుధవారం పెద్దసంఖ్యలో భక్తులువచ్చి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు.

రెండు శతాబ్దాల క్రితం ఆలయ నిర్మాణం

సుమారు 200 సంవత్సరాల క్రితం ప్రస్తుత కంబాలదేవులపల్లెతోపాటు రామకుప్పం, పేరూరు, గిడ్డపల్లె, ముద్దనపల్లె, ఆకందగానిపల్లె, మణీంద్రం, ఆవులకుప్పం, చింతకుప్పం గ్రామాల పరిధిలో తీవ్ర కరవు కాటకాలు ఏర్పడ్డాయి. పంటలు ఎండిపోయి, పశువులు కూడా మృత్యువాతపడ్డాయి. దుర్భర పరిస్థితులు తొలగిపోయి, గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలంటే చౌడేశ్వరీ సమేత సప్తమాతృకలకు ఆలయం నిర్మించాలని ఓ సాధువు గ్రామాల పెద్దలకు సలహా ఇచ్చారు. దీంతో అన్ని గ్రామాల ప్రజలు సమావేశమై విరాళాలు పోగుచేసి ఆలయం నిర్మించారు. చౌడేశ్వరమ్మతోపాటు బ్రాహ్మీ, వైష్ణవి, మహేశ్వరి, ఇంద్రాణి, కౌమారి, వారాహి మాతల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయనారంభించారు. కొద్ది రోజులకే వర్షాలు విస్తారంగా కురిసి. గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా మారాయి. కాలక్రమంలో ఆలయం జీర్ణావస్థకు చేరుకుని, పూజలు ఆగిపోయాయి.

సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం

శిథిల దశకు చేరుకున్న చౌడేశ్వరీ సమేత సప్తమాతృక ఆలయ పునర్నిర్మాణానికి 1996లో కంబాలదేవులపల్లె గ్రామస్థులు సంకల్పించి విరాళాలను సేకరించారు. అలాగే టీడీపీ మండల నేతలు ఈ విషయాన్ని అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళగా సీజేఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేశారు. దీంతో వారు ఆలయాన్ని శోభాయమానంగా నిర్మించారు. 2004లో ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అప్పటి నుంచి నిత్య పూజలు జరుగుతున్నాయి.

కంబాలదేవులపల్లెగా ...

చౌడేశ్వరీ సమేత సప్తమాతృక ఆలయం ఎదుట అప్పట్లోనే మూడు రాతి స్థంభాలను ఏర్పాటు చేసి భక్తులు పూజలు చేయడం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో స్థంబాలను కంబాలుగా పిలుస్తారు.ఆ విధంగా ఆ గ్రామానికి కంబాలదేవుళ్ళపల్లెగా పేరొచ్చింది. కాలక్రమంలో అది కంబాలదేవులపల్లెగా మారింది.

ప్రతి బుధవారం ప్రత్యేక పూజలు

కంబాలదేవులపల్లెలోని చౌడేశ్వరీ సమేత సప్తమాతృక ఆలయంలో ప్రతి బుధవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయిస్తారు. ఆలయం వద్ద గొర్రెలు, కోళ్ళు బలిచ్చి అక్కడే భోజనాలు వండి, వడ్డిస్తారు. దేవినవరాత్రుల వేళ తొమ్మిది రోజులు విశేష పూజలు, సప్తమాతృక శతనామావళి అర్చనలు నిర్వహిస్తారు. కనుమ పండుగ సందర్భంగా పది గ్రామాలకు చెందిన రైతు కుటుంబాలు తప్పక చౌడేశ్వరమ్మ ఆలయం చేరుకుని, అమ్మవార్లకు దీపారాధనలు చేసి, పొంగళ్ళు సమర్పిస్తారు.

వైసీపీ పాలనంతా దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమ కేసులే..

చల్లా రామచంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్లపాలనంతా దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమ కేసులు పెట్టేందుకే సరిపోయిందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ యర్రంవాండ్లపల్లి, పులిచెర్ల పంచాయతీ ముల్లంగివారిపల్లిలో ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యర్రంవాండ్లపల్లిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ముల్లంగి వారిపల్లి జరిగిన పల్లెపండుగలో పాల్గొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, కుమార్ రెడ్డి, వెంకట రమణ, ధనంజయనాయుడు, మురళీధర్ నాయుడు, రమేష్, మహేష్, గోపినాయుడు, రాణెమ్మ, ప్రభాకర్, మునికృష్ణమనాయుడు, నజీర్, నూర్‌భాషా, షుకూర్, తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏపీఓ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం


కెంచనబల్లలో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

శాంతిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్‌లు తెలిపారు. ఆదివారం మండల పరిధి ఎంకేపురం, కెనమాకులపల్లె, మఠం పంచాయతీల్లో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గోకులంషెడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. వైసీపీ పాలనలో అక్రమాలు, అవినీతి, దౌర్జన్యం తప్ప జరిగిన అభివృద్ధి లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో రెస్కో మాజీ వైస్‌చైర్మెన్ చలపతిస్వామి, నేతలు పీవీ నాగరాజు, రాజేంద్ర, జయరాంరెడ్డి, జయారెడ్డి, బాలు, ఎంపీడీఓ కుమార్, ఏపీఓ హరినాథ్‌లు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం కెంచనబల్లలో ఆదివారం సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు టీడీపీ నాయకులు భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ఎంపీపీ, చిన్నికృష్ణ తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : మండలంలోని పెద్దూరు, సింగిరిగుంట, చారాల, పరికిదోన, తెల్లనీళ్ళపల్లె గ్రామాలలో ఆదివారం పల్లెపండుగలో భాగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, ఎంపీడీవో లీలామాధవి, ఈవోఆర్డీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ బాధితులకు న్యాయం జరిగేనా ?

ఐదేళ్ళప్పుడు అభివృద్ధి పేరుతో ఇళ్లు ధ్వంసం ● న్యాయం కోసం ఎదురుచూపులు


ఐదేళ్ళ కిత్రం అభివృద్ధి పేరుతో బోయకొండలో తొలగించిన ఇళ్ళు (ఫైల్ ఫొటోలు)



చౌడేపల్లె, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఐదేళ్ళ క్రితం ఇళ్లు కోల్పోయిన వారికి ఇకనైన న్యాయం జరిగేనా అని వేయి కళ్ళతో బాధితులు ఎదురు చూస్తున్నారు. సుమారు 40 ఏళ్ళుగా బోయకొండ కింద దాదాపు 150 మంది రోడ్డుకు ఇరువైపులా ఇళ్ళు, షాపులు వేసుకుని జీవించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ పార్టీ నాయకులు బోయకొండ అభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పు చేయటానికి 150 ఇళ్లు నేలమట్టం చేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపించకుండానే ఉన్నఫళంగా పోలీసు బందోబస్తు మధ్య 2019 జూన్‌లో ఇళ్లను ఎక్స్‌కవేటరుతో నేలమట్టం చేశారు. ఇళ్లు కూల్చేసిన ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి మీకే తక్కువ అద్దెకు ఇస్తామని ఆలయ అధికారులు చెప్పి ఆ తర్వాత తమకు ఇవ్వలేదని బాధితులు అవేదన చెందారు. కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని బాధితులు ఎదురు చూస్తున్నారు.

పగలు కోతులు .. రాత్రి అడవి పందుల బెడద



సోమల సమీపంలో అడవిపందులు రాకుండా కట్టిన పరదాలు, వరిపొలంలో తిరగాడిన పందులు

సోమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) వేరుశనగ పంట సాగు చేసిన రైతన్నకు ఆ పంటలను కాపాడుకునేందుకు కంటి మీద కునుకులేకుండా అడవిపందులతో ఇబ్బందులు పడుతున్నారు. విత్తనం నాటినప్పుడు నుంచి వాటిని రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నాడు. సోమల మండలంలో పలు గ్రామాల్లో అటవీ శివారు భూముల్లో ఏ పంట సాగు చేసినా అడవిపందులు, కోతుల దాడులు తప్పడంలేదు. రాత్రి పొలాల వద్దనే కాపు కాస్తున్నారు. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లోకి అడవిపందులు వచ్చి తొక్కివేస్తున్నాయి. శుక్రవారం రాత్రి సోమల బంగారు తిరుత్తణి సమీపంలోని వరి, వేరుశనగ పొలాల్లోకి అడవి పందులు వచ్చి పంటలను ధ్వంసం చేశాయి. పగలు కోతులు, రాత్రి అడవి పందులు దాడులు చేస్తున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. కుప్పకొండ సమీపంలో కొందరు రైతులు పంటలను కాపాడు కునేందుకు వరి, వేరుశనగ పొలాల వద్ద రాత్రి జట్లు జట్లుగా మంటలు వేసుకుంటూ డప్పులు వాయిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు.

నేటినుంచి 3 రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం/గంగవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పరిధిలోని 220 కేవీ లైన్లో మరమ్మతులు జరుగుతున్నాయని విద్యుత్తు శాఖ డీఈఈ చిన్నబ్బ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సోమ, మంగళ, బుధవారాల్లో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు. పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, శాంతిపురం, కుప్పం మండలాల పరిధిలో మాత్రమే అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

నేడు గ్రీవెన్స్ డే

కుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుప్పం మండల సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారు. నియోజకవర్గ ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కారాలు పొందాలని కడా పీడీ కోరారు.

బీజేపీ పతాకావిష్కరణ

రామకుప్పం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మొద్దులవంకలో ఎన్డీయే నేతలతో కలిసి బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ ప్రభాకర్, కార్యవర్గ సభ్యుడు రామచంద్ర, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, జనసేన కుప్పం అధ్యక్షుడు నరేష్ బీజేపీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు గ్రామాలను అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నేతలు గోపీనాథ్, రాజసింహ, శివరాయల్, గంగాచారి, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు వెంకటేశ్, హరీష్, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు లోకేశ్‌రెడ్డి, టీడీపీ నేతలు మంజునాథరెడ్డి, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిని కలసిన పుంగనూరు నేతలు




పుంగనూరు, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజును పుంగనూరు టీడీపీ నాయకులు కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఆయనతో కలసి పుంగనూరు రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించినట్లు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రాజు, యూనిట్ ఇన్‌చార్జి వరదరాజు, జ్యోతిరాజు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు 20(ఆంధ్యజ్యోతి): క్రైస్తవ యువతీ యువకులు సన్మార్గంలో నడిచి సమాజసేవలో భాగస్వాములై అందరికీ ఆదర్శంగా నిలవాలని సీఎస్ఐ చర్చి ఫాస్టర్ రాకేశ్‌నిమ్రోద్ వివరించారు. ఆదివారం చర్చిలో యూత్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు వివరించిన సూక్తులను గుర్తుకుచేస్తూ కీర్తనలు ఆలపించి బైబిల్ పఠనం చేశారు. అనంతరం యువత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హాస్టల్ ప్రహరీ నిర్మించాలి



రొంపిచెర్ల , అక్టోబరు 20(ఆంధ్య జ్యోతి): మండల కేంద్రం రొంపిచెర్లలోని వెనుకబడిన తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం ప్రహరీ కూలి రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ఎలాంటి నిర్మాణ చర్యలు తీసుకోలేదు. వసతిగృహంలోకి పశువులు, ఇతర వ్యక్తులు, విష పురుగులు వంటివి వస్తుంటాయి. భవనానికి రెండు వైపులా ప్రహరీ పడిపోయింది. చుట్టుపక్కల పొలాలు కూడ ఉన్నాయి. అవి బీడుగా ఉన్నందున విష పురుగులు కూడా వస్తున్నాయి. దీంతో విద్యార్థులకు రక్షణ కొరవడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహం చుట్టూ ప్రహరీ నిర్మాణ చర్యలు తీసుకోవాల్సివుంది.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: జగన్మోహన్



పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ అన్నారు. ఆదివారం మండలంలోని నారగల్లు, 197 రామాపురం, నంగమంగళం, కొత్తపల్లె, రామభద్రాపురం, బసవాపల్లె పంచాయతీల్లో పల్లెపండగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధికి సుమారు రూ.6 కోట్లు వెచ్చించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నకేశవులు నాయుడు, బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, సుమతి, పీటర్, విజయ్ నాయుడు, చిట్టిబాబు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, టీడీపీ నాయకులు హరి, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివ నాయుడు, హరిప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, నాగరాజ్ యాదవ్, చంద్రమోహన్, పళని తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామభద్రాపురంలో పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం





విరాళం అందజేసిన పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్‌కేశాని - చెక్కును అందుకుంటున్న చిట్టిబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ కేశాని రూ.1,00,116, కేవీ.రమణయ్య రూ.1,00,116 చెక్కు రూపంలో ఆదివారం అందించారు. దాతలు విడివిడిగా తమ విరాళాలను అధికారులకు అందించారు. విరాళదాతలకు ఏఈవో రవీంద్రబాబు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతలకు తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

కార్యకర్తలకు బీమా సౌకర్యం: సీఆర్ రాజన్



మాట్లాడుతున్న సీఆర్ రాజన్

గుడిపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో మాత్రమే కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తామని, మరే ఇతర పార్టీలో ఇలా ఉండదని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనతో విసిగెత్తిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టంకట్టారని తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చిన కార్యకర్తలకు రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు పార్టీ తరఫున బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. ప్రతి కార్యకర్త రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తుమ్మల సాంబశివ నాయుడు, మధుసూదన్ నాయుడు, గోపి, ఇంతియాజ్, బాబు, కిట్టు, ఉదయ్, శిల్పా పాల్గొన్నారు.

డిజిటల్ తరంలో లేఖల పాత్రపై వ్యాసరచన పోటీలు



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ తరంలో లేఖల పాత్ర అనే అంశంపై భారత ప్రభుత్వ తపాలశాఖ విద్యార్థులకు జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని విజయం కళాశాలలో పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ది జాయ్ ఆఫ్ రైటింగ్, ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో పోటీలు చేపట్టారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు రూ.25 వేలు, రూ.10, రూ.5 వేలు, జాతీయ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నారు.

పీహెచ్‌సీని కొనసాగించండి

పెనుమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పీహెచ్‌సీని రద్దు చేయకుండా కొనసాగించాలని పీహెచ్‌సీ సిబ్బంది ఎమ్మెల్యే థామస్‌ను కోరారు. ఆదివారం మండలంలోని కావూరివారిపల్లి అంజనేయస్వామి ఆలయం వద్ద పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఎమ్మెల్యేతో సమావేశం అయ్యారు. 40 ఏళ్లుగా ఉన్న పీహెచ్‌సీని ఇప్పుడు రద్దు చేస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని డీసీహెచ్‌ఎస్‌కు సరెండర్ చేస్తున్నారని వారు ఆయనకు తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి తమకు న్యాయం చేయాలని ఆయన్ను కోరారు. ఇందుకు గాను న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అమరావతి పునర్నిర్మాణం పట్ల ప్రజల హర్షం: టీడీపీ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్మిణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ శ్రీకారం చుట్టినందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కళ్లల్లో ఆనందం వెల్లువెత్తుతుందని జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శులు దేవపల్లి ధనంజయ నాయుడు, రాంబాబురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ టీడీపీ ముస్లింమైనారిటీ ప్రధానకార్యదర్శి ఎస్.హెచ్.నియాజ్‌అలీ, పార్లమెంట్ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నంలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి సీఎం కాకముందు అమరావతి రాజధానికే కట్టుబడి ఉన్నానని పేర్కొని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక అమరావతి విషయం తుంగలో తొక్కి, మూడు రాజధానుల పేరుతో మాట తప్పినందుకే 2024 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి కోలుకోలేని విధంగా ప్రజలు గుణపాఠం నేర్పారని వారు ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎంగా చంద్రబాబునాయుడు పదవిలో కూర్చోవడంతోనే వివిధ రాష్ట్రాల నుంచి పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌కు క్యూకడుతున్నారని పేర్కొన్నారు.

బురదమయంగా సిమెంటు రోడ్లు



ఆలపాకంలో సిమెంటు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

విజయపురం, అక్టోబరు 20: మండలంలో సిమెంటు రోడ్లు బురదమయంగా మారాయి. తేలికపాటి వర్షం కురిసినా సిమెంటు రోడ్డు పక్కన మురుగు కాలువలు లేక పోవడం, సిమెంటు రోడ్డుపై మట్టి చేరడం వలన రోడ్డుపై మురుగు నీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజులుగా ప్రతి రోజూ వర్షం కురుస్తుండడంతో వీధుల్లో మురుగు నీరు చేరుతుందని, దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డుపై నీరు నిలవకుండా మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతల్లో మట్టి పోయండి మహాప్రభో...!

● నగరవాసుల వేడుకోలు



ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా నగరంలో ఓ మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు పడటంతో రోడ్లన్నీ పాడై గుంతలమయమయ్యాయి. దీంతో ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాహనదారులు, ప్రజలు ఆ గోతుల్లో పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇదే విషయమై నగర వాసులు నగర పాలక, జిల్లా కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఫలితం లేకుంది. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరానికి రోజూ ఎవరో ఒకరు వీఐపీ రావడం పరిపాటి. నగరాన్ని శుభ్రంగా ఉంచాల్సిన నగరపాలక అధికారులు మోకాలిలోతు గుంతలున్నా పూడ్చకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. అదే విధంగా నగరం నడిబొడ్డున ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా వర్షానికి నీరు నిలిచి దోమలు ముసిరి కంపు కొడ్తున్నా అధికారులు స్పందించక పోవడం నగరవాసులను కలిచి వేస్తోంది. దీనికి తోడు ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన ఆర్టీసీ సంస్థ.. తన కార్యాలయం ఎదుటే రెండుడగుల మేర బురద నీరు చేరినా ఆ సంస్థ ఉన్నతాధికారి కారు దిగి నీటిలోనే నడుచుకుంటూ వెళ్లడం ఆ సంస్థ ప్రయాణికులకు ఎలాంటి సేవలు అందిస్తుందో అర్థమవుతుంది. నగరంలో చర్చివీధి, బజారువీధి, గిరింపేట, న్యూ కలెక్టరేట్ మార్గాలతో పాటు అన్ని ప్రధాన రహదారుల్లో వర్షాల కారణంగా ఏర్పడిన మురుగు నీటి గుంతలను పూడ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు.

వంకను తలపిస్తున్న కోకావాళ్లఊరు రోడ్డు



వర్షపునీటితో వంకను తలపిస్తున్న రోడ్డు

చిత్తూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చాలా రోడ్లు వంకలను తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ గాలికి వదిలేయడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిత్తూరు - తిరుపతి రోడ్డులోని 1వ డివిజన్ కోకావాళ్ల ఊరుకు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. చిన్న పాటి వర్షానికే నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వంకను తలపిస్తోంది. హైవే రోడ్డు నుంచి యల్లంపల్లి, కోకావాళ్లఊరుకు సుమారు 1.5 కిలోమీటరు దూరం ఉంటుంది. రోజూ ఈ ప్రాంతం నుంచి చిత్తూరుకు వచ్చి వెళ్లే వారు ద్విచక్రవాహనం, ఆటోలను ఆశ్రయించాల్సిందే. కాగా ఈ దారిలో వాహనాలు నడపడం చాలా కష్టంగా ఉంది. చాలా మంది ద్విచక్రవాహన దారులు అదుపుతప్పి పడిపోతున్నారు. పాదచారులు నడవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. మరోవైపు ఈ మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో వెళ్లే వారి అవస్థలు చెప్పనలవి కావు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఈ మార్గంలో రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తి ప్రపత్తులతో సంకటహర చతుర్ది పూజలు



సంపద వినాయకుడికి విశేష అలంకారం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ఆలయాల్లో ఆదివారం సంకటహర చతుర్ది పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. 75 దొడ్డిపల్లె సహకార షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని సంపద వినాయక, గంగనపల్లె మోదక గణపతి, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరా, గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సంకటహర చతుర్ది పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హైవే రోడ్డుపై ప్రమాదకరంగా బండరాళ్లు

\- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన బండరాళ్లు

చిత్తూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే చిత్తూరు - తిరుపతి హైవే రోడ్డులోని కట్టమంచిలో రోడ్డుపైనే బండరాళ్లు అడ్డంగా ఉన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం నగరపాలక సంస్థ సిబ్బంది కాలువ పూడిక తీసేందుకు ఇళ్ల ముందున్న బండరాళ్లు, కడగాల రాళ్లు జేసీబీతో తీసి రోడ్డుపై వేశారు. పూడిక తీసిన తర్వాత కాలువ ఏర్పాటు చేయలేదు. తీసిన బండరాళ్లను యథాస్థానంలో పెట్టలేదు. దీంతో బండరాళ్లు రోడ్డును ఆక్రమించాయి. మరోవైపు రోడ్డు పక్కనున్న ఇళ్లవారు ఇంట్లోకి వెళ్ళడానికి తాత్కాలిక చెక్కలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఇళ్లలోని మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్లల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న బండరాళ్లను తొలగించి, డ్రైనేజీ కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయం వేరు.. ప్రభుత్వం వేరు



ఎమ్మెల్యేతో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య

గుడిపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు వేరు.. ప్రభుత్వాలు వేరని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం పల్లె పండుగ కార్యక్రమానికి రామభద్రాపురం పంచాయతీలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం వచ్చేనెల 7వ తేదీన జరిగే తన వివాహానికి రావాలని ఎమ్మెల్యేకి రమ్య తెలిపారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



సీసీరోడ్డు భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నేతలు, అధికారులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎట్టేరి, కోటాగరం గ్రామాల్లో ఆదివారం పలువురు టీడీపీ నేతలు, అధికారులు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, ఉపాధిహామి ఏపీవో శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహులు మందడి, కేశవులుశెట్టి, రూపశేఖర్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, క్రిష్ణయ్య, చిరంజీవి, దాము, రాజేంద్రన్, అన్నాదురై, ఉపాధిహామి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల చలో విజయవాడ



ఆశ వర్కర్లతో కలిసి విజయవాడ వెళుతున్న జిల్లా అధ్యక్షురాలు గీత

వెదురుకుప్పం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి ఆశ వర్కర్లు ఆదివారం బయలుదేరి వెళ్లినట్లు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని, వేతనాలను పెంచాలని కోరుతూ ధర్నా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు తాము వెళ్తున్నామని తెలిపారు.

26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

చిత్తూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆపార్టీ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షురాలు కటారి హేమలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించి శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్చార్జ్‌లు, వార్డు ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, యూనిట్ ఇన్చార్జ్‌లు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, బూత్ ఇన్చార్జ్‌లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవ్వాలని తెలిపారు.

భీమసేనుడిది విశిష్టమైన పాత్ర



సభలో ప్రసంగిస్తున్న బి. మునస్వామి

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 20: వ్యాస మహర్షి రచించిన మహాభారతంలో భీమసేనుడిది చాలా విశిష్టమైన పాత్ర అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు దండాల రాధా క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో చైతన్యసాహితి, హరివిల్లు లలిత కళావేదికల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది రాగూరునాథరెడ్డి తన తల్లిదండ్రులు, అత్తమామల స్మారకార్థం మహా భారతంలో భీముడు అనే స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మహాభారతంలో భీముడు, సుయోధనుడు ఇద్దరూ సమాన బలశాలులైనా... భీముడు అవసరాన్ని బట్టి బుద్ధి కుశలతతో వ్యవహరించి తనలోని రాగద్వేషాలను ప్రదర్శించాడన్నారు. కార్యక్రమంలో జి.జయరామిరెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, బి.మునుస్వామి, హరినాయుడు, గణేశన్, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పూతలపట్టు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పూతలపట్టు సీఐ కృష్ణమోహన్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



గాయత్రీదేవి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలం జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న కె.గాయత్రీదేవి డాక్టరేట్ పట్టా పొందారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హరిపద్మరాణి పర్యవేక్షణలో రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లీష్-ఎ కేస్ స్టడీ ఆఫ్ ఛాలెంజస్ ఫేస్ట్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ అట్ ది సెకండరీ లెవెల్ ఇన్ ఏపీ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ లభించింది. దీనిపై విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగం ప్రొఫెసర్, రీసెర్చ్ సూపర్వైజర్ డాక్టర్ హరిపద్మరాణితో పాటు డీఈవో దేవరాజు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మాతృమూర్తి మృతికి పలువురి నివాళి

విజయపురం, అక్టోబరు 20: మండలంలోని నారపరాజు కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామకమిటీ అధ్యక్షుడు రాఘవరాజు మాతృమూర్తి సుబ్బమ్మ(80) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దశరథరాజు, లోకేష్‌రాజు, సుధాకర్‌రాజు, అనిల్, వెంకటేష్ యాదవ్ తదితరులు సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బంగారుపాళ్యం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీరమందలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక బంగారుపాళ్యం సభ్యులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి. ధనుంజయ, బాలాజి, ఆర్. మునిరత్నం, రాజేంద్ర, విమలమ్మ, ఉదయ్, రేఖ, కళ్యాణి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాది దోపిడీ ప్రభుత్వం కాదు: ఎమ్మెల్యే థామస్



తెల్లగుండ్లపల్లె కాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మాది దోపిడి, దొంగల ప్రభుత్వం కాదని, గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం వెదురుకుప్పం మండలం తెల్లగుండపల్లె కాలనీ, ఆడారెడ్డిపల్లెలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడీనెల్లూరు నియోజకవర్గంలో తొలి విడతగా రూ.16.5కోట్లతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయిస్తున్నామని, మిగిలిన అన్ని గ్రామాల్లో కూడా వీధులకు సిమెంటు రోడ్లను దశలవారీగా వేయిస్తామన్నారు. ఇతర పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా తమ దృష్టికి సమస్యలు తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో అమరనాథ్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రి కుమార్, టీడీపీ నాయకులు బాష్యం సతీష్ నాయుడు, ప్రతాప్, పవన్‌కుమార్, మునికృష్ణ, శ్రీరాములు నాయుడు, రావిళ్ల వెంకటాద్రి నాయుడు, కఠారి మోహన్‌రెడ్డి, పళ్లిపట్టు వెంకటేష్, మారేపల్లి మురళి, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూ ఆక్రమణలపై చర్యలు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన భూఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఎస్ఆర్‌పురం మండల కేంద్రంలో గుండ్లమిట్ట, 49. కొత్తపల్లెమిట్టలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ గిరి నాయుడు, బూత్ కన్వీనర్ గురునాథం, నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్, బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, ఎంపీడీవో మురళీమోహన్, తహసీల్దార్ లోకనాథం పిళ్లై, నాయకులు రుద్రప్ప నాయుడు, డిల్లెయ్య, ఎస్.కుమార్, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు, అక్టోబరు 20: మండలంలోని కావూరివారిపల్లిలో, గంగుపల్లి, సీఆర్ కండ్రిగ పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు పనులకు ఎమ్మెల్యే థామస్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, హరిబాబు నాయుడు, భాస్కర్, మనోహర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ఎన్ఎస్ నాయుడు, యువరాజులు నాయుడు, ఏకాంబరం, సురేష్ చౌదరి, అశోక్, రాజగోపాల్ నాయుడు, బాబు నాయుడు, చంద్రబాబు నాయుడు, హేమాద్రి నాయుడు, జనసేన నేతలు లోకనాథ నాయుడు, శ్రీనివాసులు, ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి, పీఆర్ డీఈఈ ఆనంద్‌రెడ్డి, ఏఈ గురవారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమేష్‌బాబు, విద్యుత్ ఏఈ తులసిప్రసాద్, ఏపీవో గుణశేఖర్, సెక్రటరీలు హేమలత, సురేంద్ర, సురేఖతో పాటు అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలసముద్రం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణజిమ్మాపురం, వీర్లగుడి, కన్యకాపురం గంగమాంబాపురం గ్రామాల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే థామస్ భూమి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, తంగరాజు, అరుళ్‌నాథన్, సాంబశివన్, తహసీల్దార్ అరుణ్‌కుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి,ఏపీవో మార్గరేట్, ఏఈ వరదరాజులు పాల్గొన్నారు.